క్లుప్తంగా

వెంకటాపురంలో పెద్దమ్మ జాతర

దొనకొండ: మండలంలోని వెంకటాపురంలో గ్రామస్తులు మూకుమ్మడిగా కులాలకు అతీతంగా ఆదివారం పెద్దమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి పెద్దమ్మకు మొక్కు బడులు చెల్లిస్తారు. 3 సంవత్సరాలకు ఒకసారి పెద్దమ్మ జాతర నిర్వహించేవారు. కరోనా సందర్భంగా 7 సంవత్సరాలకు జాతరను జరుపుకుంటున్నారు.

వైభవంగా గోపయ్య స్వామి ఆలయ వార్షికోత్సవం

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పలువురు దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి జనార్దన శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుంటి గంగా భవాని అమ్మవారికి విశేష పూజలు


అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయ లక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అమ్మవారికి భక్తులు ఐదు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 7,342 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పీ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకం శెట్టి శ్రీనివాసరావు, ఈఓ. భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

350 మందికి ఉచిత షుగర్ పరీక్షలు


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


మార్కాపురం: సమాజసేవలో భాగంగా ప్రతి నెలా నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని పట్టణ వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి శ్రీబాలాజీ ఇమేజింగ్, డయాగ్నోస్టిక్స్ చైర్మన్ పత్తి రవిచంద్ర అన్నారు. పట్టణంలోని నాయుడు బజారు, తూర్పువీధి, శివాలయం, కోనేటి వీధి, మెయిన్ బజారుకు సంబంధించిన ప్రజల కోసం మండపం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత షుగర్ రక్త పరీక్షల క్యాంపులో 350 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

54 మద్యం సీసాలు స్వాధీనం


మద్యం సీసాలతో ఎస్‌ఐ

దొనకొండ: అక్రమంగా తరలిస్తున్న 54 మద్యం సీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ యం.సైదుబాబు తెలిపారు. దర్శి మండలం చందలూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దొనకొండ నుంచి అక్రమంగా 54 మద్యం సీసాలు తరలిస్తున్నారు. సమాచారం మేరకు తాము, తమ సిబ్బందితో వెళ్ళి పట్టుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని దర్శి సబ్ కోర్టుకు హాజరు పరుచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న బొమ్మల కోటేశ్వరి

త్రిపురాంతకం: స్థానిక శాఖా గ్రంథాలయంలో రికార్డులను ఆ శాఖ జిల్లా కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయానికి అవసరమైన సామగ్రిని త్వరలోనే మంజూరు చేస్తామని, వేసవిలో పిల్లలు, పెద్దలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠకుల కోసం ఆన్ డిమాండ్ బుక్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల వెతలకు విముక్తి


వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్


గత ప్రభుత్వంలో క్యూలో నిలబడి పెన్షన్లు పొందుతున్న దృశ్యం (ఫైల్)

- గత ప్రభుత్వంలో చీదరింపులు, పడిగాపుల మధ్య పెన్షన్లు
- నేటి ప్రభుత్వంలో ఆదరణ.. పలకరింపులతో పెన్షన్లు

గిద్దలూరు రూరల్: గత ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు పెన్షన్లు పొందాలంటే కార్యాలయాల వద్ద పొద్దు మొదలుకుని పొద్దుగూకే వరకు అక్కడే పడిగాపులు గాచి గంటల కొద్ది నిలబడి ఎన్నో చీదరింపులు బరాయిస్తు మరెన్నో అవస్థ పడితే కానీ పెన్షన్ డబ్బులు చేతికి అందేవి కాదు. మరో వైపు టీడీపీ నాయకులకు సిఫార్సులతో వారికి చెందిన వారికి ముందుగానే పెన్షన్లు అందించే వారు ప్రస్తుత పరిస్థితులో పార్టీలకు అతీతంగా ఎవరైన సరే లబ్ధిదారుడు ఎక్కడ ఉన్నా సరే వారి వద్దకే పెన్షన్లు అందిస్తున్నారు. నేడు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధుల సౌలభ్యం కోసం వారు ఏ ప్రాంతంలో ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఉన్న చోటకే పెన్షన్ నగదు అందజేయడం పై లబ్ధిదారులలో ఆనందాలు వెదజల్లుతున్నాయి. లబ్ధిదారుడు అనారోగ్యానికి గురై ఎక్కడైనా వైద్యం పొందుతున్నా.. లేక వారి బంధువుల ఇంటి వద్ద ఉంటున్నప్పటికీ వారి వద్దకు నేరుగా వలంటీర్లు వెళ్లి చేతికి డబ్బులు అందజేస్తున్నారు. ఇలా అందరి ఆదరణాభిమానాలను పొందుతున్నారు.

ఆలయంలో జంకె ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఉన్న వెంకచ్చమ్మ గుడిలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిళం జీయర్ స్వామివారు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ పూజలలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం


కాలిపోతున్న గడ్డి వామివద్ద రైతు

కురిచేడు: మండలంలోని వెంగాయపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం గడ్డివామి దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొరిగొర్ల కోటేశ్వరరావు తన పశువుల కోసం కొనుగోలు చేసి తెచ్చుకున్న గడ్డి పూర్తిగా కాలిపోయింది. గ్రామంలోని ఓ వ్యక్తి మృతి చెందాడు. అతని అంతిమ సంస్కారంలో పేల్చిన బాణసంచా పైకిలేచి వామిపై పడటంతో ఈ ఘటన చోటుచేసుకుందని గ్రామస్తులు తెలిపారు. తిరిగి పశువులకు మేత సేకరించాలంటే కష్టంగా మారిందని, పశువుల నోటికాటిమేత కలిపోవటంతో ఆ రైతు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. దర్శి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

బీసీల ఆరాధ్య దైవం సీఎం జగన్


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు

మార్కాపురం: స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్లలో రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా బీసీలకు చేయని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేశారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఇటీవల 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 స్థానాలను బీసీలకు ఇచ్చారని, రాష్ట్ర క్యాబినెట్‌లో 9 మంది బీసీలు ప్రధాన శాఖల్లో ఉన్నారని, వివిధ కార్పొరేషన్‌లలో చైర్మన్‌లుగా, డైరెక్టర్‌లుగా 700 మంది బీసీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. దీంతో సీఎం బీసీల ఆరాధ్య దైవంగా మారారన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కేపీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను బీసీ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించి తమ తరపున సీఎంకు కృతజ్ఞతలు తెలపాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం బీసీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రాజ్యాధికారం కల్పిస్తున్నారన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో బీసీలంటే బ్యాక్‌వర్డు క్యాస్టుగా భావించారని, జగనన్న ప్రభుత్వంలో బీసీలంటే బ్రిలియంట్ క్యాస్టు, బ్యాక్‌బోన్ క్యాస్టుగా గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, పీఎల్‌పీ యాదవ్‌లు మాట్లాడుతూ బీసీలకు వైఎస్సార్ సీపీ అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మీరామ సుబ్బారెడ్డి, మురళీ కృష్ణ, యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, బీసీ సంఘాల నాయకులు రంగస్వామిగౌడ్, పోలయ్య, అచ్చయ్య, రాజ్‌కుమార్, దూదేకుల ప్రసాద్, ఉత్తమ్ కుమార్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, చక్రపాణి, నాలి కొండయ్య, టీపీ వెంకటేశ్వర్లు, పత్తి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లకు అవగాహన

పొదిలి: ఎమ్మెల్సీ ఓటర్లకు ఓటు వేసే విధానం పట్ల అవగాహన కల్పించాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. మొదటి ప్రాధాన్యత ఓటును పార్టీ అభ్యర్థులకు వేయాలన్నారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షులుగా గుజ్జుల సంజీవరెడ్డి ఎంపికయ్యారు. పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గజమాలతో సత్కరించారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డి.శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ నూర్జహాన్ బేగం,మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు కె.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, మండల మాజీ కన్వీనర్ జి. శ్రీనివాసులు, కల్లం వెంకట సుబ్బారెడ్డి, బీసీ విభాగం కన్వీనర్ పి. శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు, సర్పంచ్‌లు ఆవుల సుబ్బారెడ్డి, సి.హెచ్. సుబ్బారెడ్డి, గూడూరి వినోద్, యువజన విభాగం కన్వీనర్ ఫిరోజ్, ఏ.ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: ప్రముఖ హాస్య అవధాని, జర్నలిస్టు శంకరనారాయణ షిర్డీ సాయి బాబా శతకాన్ని రచించటం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో పుస్తకం ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు, పి.సత్యనారాయణ, నాగరాజు, పీఎల్‌పీ యాదవ్ ల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ

ఘనంగా కోటా సత్యమాంబదేవికి పూజలు


బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


మార్కాపురం టౌన్: పోలేరమ్మ అమ్మవారి మూలవిరాట్

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామపూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు రెండో ఆదివారం భక్తులు పోటెత్తారు. పూజారి వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ బి. శ్రీనివాసులు, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు అన్ని ఏర్పాట్లను చేశారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ


గో పూజ చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో గో పూజా చేపట్టారు. ఆదివారం సందర్భంగా నారాయణస్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, గోపూజ, మహా నివేదన, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్లు చేతబూని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ పూజారులు సత్యనారాయణశర్మ, ప్రసాద శర్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

భిక్షాటనలో బడిఈడు పిల్లలు

కంభం: పాఠశాలకు వెళ్లి పుస్తకాలు చేతబట్టి చదువుకోవాల్సిన పిల్లలు ఇంకా వీధుల వెంట భిక్షాటన చేసుకుంటూ కనిపిస్తున్నారు. ప్రభుత్వం పేదలందరికీ నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంది. తల్లిదండ్రుల అవగాహన లోపం, కొన్ని చోట్ల విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతో బడిఈడు పిల్లలు రోడ్లవెంబడి భిక్షాటన చేసుకుంటూ దర్శనమిస్తున్నారు. బడిఈడు పిల్లలను గుర్తించే కార్యక్రమం నిరంతరంగా జరుగుతున్నప్పటికీ అక్కడక్క చిన్న పిల్లలు భిక్షాటన చేసుకుంటూ కనిపిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. కొందరి పిల్లల పేర్లు పాఠశాలల్లో నమోదై ఉన్నప్పటికీ వారు చదువుకోడానికి వెళ్ళకుండా రోడ్ల వెంట తిరుగుతున్నారు. అటువంటి వారిని విద్యాశాఖ సిబ్బంది గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలందరినీ చదువుకునేలా ప్రేరేపించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు గ్రహీతకు అభినందనలు


సుబ్బారావును సన్మానిస్తున్న సాంస్కృతి సేవా సంఘాల ప్రతినిధులు

అద్దంకి రూరల్: బెస్ట్ సోషల్ వర్కర్‌గా ఢిల్లీలో ఈనెల 24న అవార్డు పొందిన హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావును ఆదివారం గాడేపల్లి దివాకరదత్తు గృహంలో సాంస్కృతి సేవాసంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించి, అభినందనలతో ముంచెత్తారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), విద్వాన్ చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, కొల్లా భువనేశ్వరీ, షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొండముది బంగారుబాబు, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

10066 మంది రైతులకు రూ.2.11 కోట్ల సాయం

బల్లికురవ: ప్రభుత్వం మూడోవిడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం కింద 10066 మంది రైతులకు రూ.2.11 కోట్లు మంగళవారం ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమచేస్తారని వ్యవసాయాధికారిణి ఎస్‌పీపీ కుమారి ఆదివారం తెలిపారు. మూడో విడత వైఎస్సార్ రైతు భరోసాలో కౌలు రైతులు 228 మంది, కొత్తగా దరఖాస్తు చేసుకున్న 146 మందితో కలిపి 1723500 పీఎం కిసాన్ ఆర్థిక సాయంలో 9692 మందికి ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పున రూ.1.94 లక్షలు ఆర్థిక సాయం మంజూరైనట్లు చెప్పారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

కనిగిరి రూరల్: కేటీఆర్ స్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. నూతన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఎంతో భక్తిశ్రద్ధలతో విశ్వేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అంకురారోహణం నిర్వహించారు. విశాఖపట్నం, రాజమండ్రి నుంచి వచ్చినపురోహితులు సూర్య నారాయణమూర్తి, సూరిబాబు, సాయి కుమార్‌ల ఆధ్వర్యంలో ఎంతో నియమ నిష్టలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి శారద దంపతులు, మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి దంపతులు, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. వచ్చే నెల 3వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి


పులి శ్రీనివాస ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

కంభం: నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేస్తూ పలు అవార్డులతో పాటు డాక్టరేట్ అందుకున్న పులిశ్రీనివాస ప్రసాద్ అభినందనీయుడని ప్రకాశం జిల్లా కాపునాడు కన్వీనర్ ఆమంచి స్వాములు, నెహ్రూ యువకేంద్ర ప్రాంతీయ కో ఆర్డినేటర్ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం పులిశ్రీనివాస ప్రసాద్ దంపతులను సన్మానించారు. లయన్స్ క్లబ్ పీడీజి విజయ్ చంద్, హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రొటెక్షన్ ఉమెన్ సెల్ చైర్ పర్సన్ రావూరి అరుణ తార, రిటైర్డ్ జెడ్పీ సీఈఓ దస్తగిరి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, కొత్తపల్లి నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్టు

అద్దంకి: సంతమాగులూరు మండలంలోని అడవిపాలెంలోని నీలంపాటి అమ్మవారి నాలుగో వార్షికోత్సవం ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారికి మండలంతోపాటు పరిసర మండలాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి కుంకుమ పూజలు చేశారు. వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి తిరునాళ్ల నిర్వహించనుండటంతో ఎలక్ట్రిక్‌ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన పాట కచేరీలు అలరించాయి.


పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఘనంగా సీపీఐ నేత సుబ్బరాయుడు వర్ధంతి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్

త్రిపురాంతకం: మండల సీపీఐ కార్యాలయంలో సీపీఐ నేత, రిటైర్డ్ టీచర్ గాలి సుబ్బరాయుడు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులను చదువులో తీర్చిదిద్దడమే కాకుండా, పార్టీకి ఎంతో సేవ చేశారని కొనియాడారు. సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య నేతృత్వంలో గుంటూరు శంకర నేత్ర వైద్యశాల డాక్టర్లు 500 మందిని పరీక్షించి, 150 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాస్, కృష్ణగౌడ్, నాయకులు చెన్నయ్య, గురునాథం, తిరుమలయ్య, గాలి లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.